పంటలకు తెగుళ్లు

- వరిని ఆశించిన మొగిపురుగు, తాటాకు తెగులు
- మొక్కజొన్నకు కత్తెర పురుగు
- ప్రతికూల వాతావరణమే కారణం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఖరీఫ్ సీజన్‌లో సాగవుతున్న పంటలకు సరైన వర్షాలు లేకపోవడంతో తెగుళ్ల ఆశిస్తున్నాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలను తెగుళ్ల, పురుగులు సోకుతున్నాయి. పంటలను అధికంగా దెబ్బతీసే మొగిపురుగు, తాటాకు తెగులు, కత్తెర పురుగు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుచేసిన పంటలను కాపాడుకునేందుకు మందుల కోసం ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 2.85 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మొక్కజొన్న 46,194 ఎకరాల్లో వేశారు. సోయా 32,116 ఎకరాల్లో సాగవగా ఈ పంటను కూడా పురుగు ఆశించి ఆకులను తినేస్తున్నాయి. పలుచోట్ల మొక్కజొన్న బుట్టదశకు రాగా ఆకులతో సహా బుట్టను తినేస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా నియంత్రణ సాధ్యం కావడం లేదని రైతులు చెప్తున్నారు.


వరికి తాటాకు తెగులు సోకడంతో తెల్లగా మారిన ఆకు కొనలు


కత్తెర పురుగు తినేసిన మొక్కజొన్న ఆకులు

పెరిగిన ఖర్చులు..

వర్షాల్లేక పంటలకు ప్రతికూల వాతావరణం ఏర్పడింది. ఇది తెగుళ్ల ఉధృతిని ఎక్కువ చేస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. తెగులు బారిన పంటలను కాపాడుకోవడానికి రైతులు పురుగు మందులను కొనుగోలు చేస్తున్నారు. అదనంగా ఎకరానికి రూ.2వేల వరకు ఖర్చు పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.

వర్షాలు పడకపోతే ఇబ్బంది



వాతావరణం పంటల కు అనుకూలంగా లేకపోవడంతో పంటలపై తెగుళ్ల, పురుగులు దాడి చేస్తున్నా యి. ఆకులను తినేసి మొ క్కలకు బలం లేకుండా చేస్తున్నాయి. నేను మూ డున్నర ఎకరాల్లో మక్క, రెండెకరాల్లో సోయా వేశాను. తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు ఖర్చు పెట్టి మందులు కొన్నాను. వర్షాలు పడకపోతే పంటలకు ఇబ్బందిగా ఉంటుంది. – తిరుపతిరెడ్డి, రైతు, నికాల్‌పూర్

తీవ్రతను బట్టి మందులు వాడాలి

పంటలను ఆశిస్తున్న తెగుళ్ల, పురుగులు వాటి తీవ్రతను బట్టి రైతులు మందులు వాడాలి. కొద్దిపాటిదానికే ఎక్కువ మోతాదులో మందులు వేయడం ప్రమాదకరం. మక్కలో కత్తెర పురుగు ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 5జీ గుళికలు ఎకరానికి 150గ్రాములు వేయాలి. స్పైనెటోరమ్ 100ఎంఎల్ ఎకరానికి, నోవాలురాన్‌తో పాటు ఇమామెక్టిన్ బంజోయేట్ 300 ఎంఎల్ ఎకరానికి స్ప్రే చేసినా సరిపోతుంది. వరిలో తాటాకు తెగులుకు జినెబ్–75 పౌడర్‌ను 400 గ్రాములు, క్లోరోసైపర్ లేదా ప్రోఫెనోఫోస్ 350ఎంఎల్ ఎకరానికి స్ప్రే చేయాలి. – ప్రశాంత్, ఏఈవో, డొంకేశ్వర్

క్లుప్తంగా

నవోదయకు ఎస్‌ఎస్‌వీ విద్యార్థి ఎంపిక



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇటీవల విడుదలైన నవోదయ ఫేజ్–2 ఫలితాల్లో డొంకేశ్వర్ మండలంలోని ఎస్‌ఎస్‌వీ పాఠశాల నుంచి మంచిర్యాల అభిరామ్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి తెలిపారు. నిజాంసాగర్‌లో సీటు సాధించగా, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ ఏడాది పాఠశాల నుంచి గురుకులాలు, మోడల్ స్కూళ్ల, నవోదయకు పలువురు విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లాకు చెందిన ప్రియాంక గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. తెయూలో 2013–15 సంవత్సరంలో ఎంఎస్‌సీ కెమిస్ట్రీలో ప్రియాంక టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో రెండో కాన్వకేషన్ కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

ఘనంగా డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుక



వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో బుధవారం డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుణ్ణి వేడుకున్నారు. కార్యక్రమంలో వేల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ భైరి శ్రీధర్, డైరెక్టర్ చేపూర్ గంగాధర్, నాయకులు అడ్వల పెద్ద హన్మాండ్లు, అడ్వల హన్మాండ్లు, పి.మనోహర్‌రావు, దాసరి అనిల్, ఆత్మరాం, గంగామోహన్,పరమేశ్వర్, అమర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



బోధన్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు.ఈమేరకు బుధవారం పట్టణ కేంద్రంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు నాయకులు, విద్యార్థులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నగేశ్ మట్లాడుతూ పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. డివిజన్ కార్యదర్శి నిఖిల్,నాయకులు వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గోవిందపేట గ్రామానికి చెందిన బండిమీది సుభాష్(33) మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సుభాష్ ఏ పని చేయకుండా మద్యం సేవిస్తూ తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. దీంతో క్షణికావేశంలో ఈ నెల 14న రాత్రి గుర్తుతెలియని మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుభాష్‌ను గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి



రుద్రూర్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామంలో తాగు నీరు, పారిశుద్ధ్యం, నర్సరీని పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. జీపీ కార్యదర్శి మోహన్, కారోబారి అశోక్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: మహిళ సంఘాల్లో ఉన్న సభ్యులు చిరు వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని రైతు బజార్‌లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళ సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యా పారాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టీఎంసీ ఉదయ్‌శ్రీ, రాజలింగం, మెప్మా ఆర్పీలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు


డొంకేశ్వర్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

డొంకేశ్వర్/పెర్కిట్ : పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. డొంకేశ్వర్ పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, పూలు, కూరగాయలు, నీడనిచ్చే, ఔషధ మొక్కలను నాటారు. హెచ్‌ఎంలు సురేశ్ కుమార్, విశ్వనాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నారు మడికి నీరు కోసం..


ట్యాంకర్ నీరు పడుతున్న రైతు

బాల్కొండ: ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో గల పలు గ్రామాల రైతులు కాకతీయ కాలువ, లక్ష్మి కాలువ ఆయకట్టు భూముల్లో వరి నారు మడిలు వేశారు. ప్రస్తుతం వర్షాలు కురువక పోవడంతో నారు మడికి నీరు కోసం తంటాలు పడుతున్నారు. బుధవారం మెండోరా మండలం వెల్కటూర్ గ్రామ శివారులో గల రైతు నారు మడికి ట్యాంకర్ ద్వారా తెచ్చిన నీటిని అందించారు.

కూరగాయల సాగులో ఆదర్శం

- ఏడాదికి రూ.10 లక్షలకుపైగా ఆర్జిస్తున్న జలాల్‌పూర్ రైతు కత్తి అజయ్‌కుమార్
- సేంద్రియ ఎరువులతో ఏడు ఎకరాల్లో సాగు

బాల్కొండ : బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కత్తి అజయ్‌కుమార్ కూరగాయల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. తన కున్న మూడెకరాలతో పాటు, మరో నాలుగు ఎకరాలు కౌలు తీసుకోని కూరగాయలు సాగు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు సాగు చేస్తున్నాడు. 20 ఏళ్ల దుబాయిలో జీవనం గడిపాడు. ముందుగా ఎకరం భూమిలో ఆయన కూరగాయల సాగు ప్రారంభించాడు. లాభాలు రావడంతో ఏటేటా కూరగాయలు సాగు పెంచుకుంటూ పోయాడు. కూరగాయాల్లో ప్రధానంగా బీర, కాకర, చిక్కుడు, దొండకాయ, బెండకాయ, వంకాయాలు, టమాట, మునగకాయ లాంటి పంటలను సాగు చేస్తున్నాడు. ప్రతి సీజన్‌కు 3.5 లక్షలు ఆదాయంతో, ఏడాదికి సుమారుగా రూ. 10 లక్షలు ఆర్జిస్తున్నాడు. ఇలా సాగు చేసిన కూరగాయలను సొంత వాహనంలో మార్కెట్‌కు తరలిస్తున్నాడు.



సాగుచేస్తున్న బెండకాయ, కీర దోస

హోం డెలివరీ...

కూరగాయలను మార్కెట్‌లో విక్రయించడమే కాకుండ నేరుగా హోం డెలివరీ కూడా చేస్తున్నాడు. సుమారు మూడు వందల మంది వినియోగదారులతో వాట్సప్‌లో ఓ గ్రూప్ క్రియేట్ చేశారు. ఆ గ్రూప్‌లో ఎవరు కూరగాయలు కావాలని సమాచారమిస్తే వారికి ఆర్మూర్ పట్టణంలో కూరగాయలను సరఫరా చేస్తున్నాడు. ఈవిధంగా నెలకు అదనంగా రూ. 10వేలు సంపాదిస్తున్నాడు. ఈ రైతు వద్ద లభించే కూరగాయలు కాకుండ ఇతర కూరగాయ పంటలను సాగు చేసే మరో ఇద్దరి రైతులతో కలిసి అన్ని రకాల కూరగాయలను, ఆకు కూరలను సరఫరా చేస్తున్నాడు. వర్కర్లను పెట్టి సరఫరా చేస్తున్నాడు, దీంతో రైతుతో పాటు మరో పది మందికి ఉపాధి లభిస్తుంది.

ప్రోత్సాహం అందించాలి



కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తూ ప్రోత్సహించాలి. కూరగాయల సాగులో మంచి ఆదాయం వస్తుంది. నిత్యం కూరగాయలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక చేసుకుంటూ పంటను విత్తుకుంటాను. భవిష్యత్తులో ఆవకాడ సాగు చేయుటకు ప్రణాళిక చేస్తున్నాను. ప్రభుత్వం నుంచి ప్రోత్సహం అందితే అనేక రకాల కూరగాయలను సాగు చేస్తాను. – కత్తి అజయ్‌కుమార్, రైతు

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- నియోజకవర్గస్థాయి ఇందిర మహిళా శక్తి సంబురాల్లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- మహిళా సమాఖ్యల ప్రతినిధులకు రూ.30 కోట్ల చెక్కుల పంపిణీ

బోధన్ : మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మాజీ మంత్రి ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రం శివారులోని సరయూ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ఇందిర మహిళ శక్తి సంబురాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు పొదుపు మహిళా సంఘాలకే అప్పగించామని, వాటి ద్వారా వచ్చే కమీషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పొదుపు మహిళ సంఘానికి రూ.20 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐదు మండలాలకు సంబంధించి రూ.30 కోట్ల 98 లక్షల చెక్కులను పొదుపు మహిళా సమాఖ్యల ప్రతినిధులకు పంపిణీ చేశారు. బోధన్, సాలూర, ఎడపల్లి ,రెంజల్, నవీపేట మండలాల ఐకేపీ అధికారులు పొదుపు మహిళ సంఘాల ప్రగతి నివేదికలను వివరించారు. ఎమ్మెల్యేను మహిళా సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్, అడిషనల్ పీడీ మధుసూదన్,డీపీఎం నీలిమా, సంధ్యారాణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత,మండలాల ఏపీఎంలు,తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, నాయకులు పులి శ్రీనివాస్, బిల్ల రాంమోహన్,లింగం,ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎడపల్లిలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి

బోధన్: దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల పింఛన్‌లను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎడపల్లిలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. గైని రాములు,నజీర్, శంకర్‌తదితరులున్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు


సదస్సులో మహిళ రైతుకు బైబ్యాక్ అగ్రిమెంట్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

ఎడపల్లి మండల కేంద్రం శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులు, అధికారులు ఆయిల్‌పామ్ సాగు, యజమాన్య పద్ధతులు, రైతుల ఒప్పందం వివరాలను వివరించారు. ప్రీయూనిక్ డైరెక్టర్ పాశం ప్రసాద్‌రావు, డీజీఎం మల్లేశ్వర్‌రావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో ధర్నా

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం గురువారం జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ఎదుట ధర్నా తలపెట్టామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ తెలిపారు. దివ్యాంగులకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

లిడ్‌కాప్ భూములను పరిరక్షించాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో గల లిడ్ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాచర్ల రాజ్ దశరథ్ అన్నారు. చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని లిడ్ కాప్ భూములను పరిశీలించే యాత్ర కా ర్యక్రమాన్ని జిల్లాలోని ఆర్మూర్ లిడ్‌కాప్ పార్కు నుంచి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని జిల్లాలలో తోళ్ల పరిశ్రమల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు కార్యక్రమంలో కొండ్లెపు రాము, కనుగోరి విజయకుమార్, మంచిర్యాల మోతే స్వామి, వంతలపుల కొమురయ్యలు పాల్గొన్నారు.

రైతులను, బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట్(ఆర్మూర్): రైతులను, బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదన్నగారి విఠల్‌రావు విమర్శించారు. బుధవారం నందిపేట మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చేయడం తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, మాజీ సర్పంచులు నాయుడు రామారావు, డీఈ రమణ, బాలగంగాధర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

బోధన్: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ఈచట్టాన్ని తిరస్కరిస్తున్నామని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బోధన్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. సభలో ఎంపీ ఓవైసీ, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన సవరణ చట్టం వక్ఫ్ బోర్డు స్వతంత్రను దెబ్బతీస్తోందని ఓవైసీ అన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పించబడుతోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం పై సుప్రీం కోర్టులో అప్పీలు చేశామన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా తయారులో పౌరసత్వ పున: పరిశీలన (ఇంటెన్షన్ ప్రీ రివిజన్) చేపట్టిందని, ఇందుకు 10 రకాల డాక్యుమెంట్లుల్లో ఏదో ఒకటి ఆధారం చూపించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారం లేకుంటే ఓటరు జాబితాలో పేరును తొలగించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మా ట్లాడుతూ కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని, వక్ఫ్ స వరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో గళం ఎత్తారన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర కన్వీనర్ షఫీఖ్ జామీ, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర కన్వీనర్ హమీద్ మహ్మద్ ఖాన్, ప్రతిని ధి మౌలానా ఖాయల్ రహీ, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ, తదితరులున్నారు.

విష జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

ఆర్మూర్: వర్షాకాలంలో విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటు వ్యాధుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న తీరుకు పూర్తి వ్యతిరేకంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఉన్నాయన్నారు. తమ డిమాండ్లను తెలియజేస్తూ ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. పీవోడబ్ల్యూ నాయకులు లక్ష్మి, సుల్తానా బేగం, నందిని తదితరులున్నారు.

జీపీ కార్మికుల వేతనాల్లో కోత విధించొద్దు


పోతంగల్‌లో వినతిపత్రం అందిస్తున్న జీపీ కార్మికులు

రుద్రూర్: గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించే వేతనాల్లో కోత విధించ వద్దని జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ అన్నారు. ఈ మేరకు పోతంగల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. పోతంగల్ జీపీలో మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించే క్రమంలో కార్మికులు అత్యవసర పరిస్థితుల్లో రెండు రోజులు విధుల్లోకి రాలేకపోతే అధికారులు వేతనాల్లో కోతలు పెడుతున్నారని ఆయన వాపోయారు.యూనియన్ మండలాధ్యక్షుడు అర్జున్, నాయకులు సునీత, నాగేష్, కార్మికులు సాయవ్వ, గంగామణి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు .

బీజేవైఎం మండల కార్యవర్గం



నందిపేట్(ఆర్మూర్): మండల బీజేవైఎం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నియమించారు. బుధవారం నందిపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షులుగా రొక్కడి సాగర్, ఎల్లోల్ల అజయ్, మస్కూరి శ్రీకాంత్ అర్వింద్, తరుణ్ యాదవ్, తొంటి శేషులు, ప్రధాన కార్యదర్శిగా మన్మోహన్, ఏశాల యందు, సుమన్‌లు, అధికార ప్రతినిధులుగా రాజారాం, రితీష్, నిఖిల్, కాంత్ లను నియమించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పటేల్‌రాజు, మండల బీజేవైఎం అధ్యక్షుడు నవీన్‌లు నియామక పత్రం అందజేశారు.

మహాత్మా జ్యోతీబాపూలే హాస్టల్ తనిఖీ

బోధన్ టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి మహాత్మా జ్యోతీబాపూలే హాస్టల్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తనిఖీ చేశారు. హాస్టల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. 1,2,20 వార్డుల్లో పర్యటించి, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు.

ఆధ్యాత్మికం

సాటాపూర్ శ్రీరామాలయంలో యజ్ఞం



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రా మంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయంలో బుధవారం యజ్ఞం, అన్నదాన కార్యక్రమాలను ని ర్వహించారు. ఆలయ ప్రతిష్ఠాపన నిర్వహించి 41 రోజులు పూర్తి కావడంతో వేద పండితులచే కలశపూజ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించా రు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నితిన్, గోపికృష్ణ, గంగారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి స్థానిక నిమిషాంబ దేవీ ఆలయం వరకు బోనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.